పద్ధతి కాదు గురూ!

- కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధిపత్య పోరు
- గణిత ఉపాధ్యాయుడి అత్యుత్సాహంతో ఇబ్బందులు
- పోలీస్ స్టేషన్‌కు చేరిన పాఠశాల పంచాయితీ
- ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిన ఎస్సై


కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కొమరోలు:

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడి ఆధిపత్య ధోరణి కొమరోలు మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పెత్తనం చెలాయించాలని చూసిన ఆ ఉపాధ్యాయుడు ఏకంగా పోలీసు స్టేషన్ మెట్లెక్కడం గమనార్హం. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అశ్వనీకుమార్ గత రెండేళ్లుగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కాశయ్య బేస్తవారపేట ఎంఈఓ–1గా నియమితులు కావడంతో అశ్వనీకుమార్ రెండేళ్లుగా తాత్కాలిక హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్నారు.

గణితం చెప్పడం లేదని అభియోగం

గణిత ఉపాధ్యాయుడిగా ఉన్న అశ్వనీకుమార్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తాను చెప్పవలసిన తరగతులకు అసలు వెళ్లకుండా హాజరు వేసుకుని బయట పనులు చేసుకుంటున్నట్లుగా విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న రెండేళ్లలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్లు ఆరోపణలు ఉన్నాయి. 10వ తరగతి విద్యార్థులకు గణితం సక్రమంగా బోధించకపోవడం వల్లే ఆ పాఠశాలలో ఏకంగా 81 మంది విద్యార్థులు గణితంలో ఫెయిలయ్యారన్న చర్చ ఇప్పుడు సర్వత్రా నడుస్తోంది.

ఎఫ్‌ఏసీ హెచ్‌ఎం కోసం పట్టు

ఏప్రిల్ 30వ తేదీన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశయ్య పదవీ విరమణ పొందారు. ఆ స్థానంలో సీనియర్ ఉపాధ్యాయులకు ఎఫ్‌ఏసీ ప్రధానోపాధ్యాయుడిగా పూర్తి అదనపు బాధ్యతలు విద్యాశాఖ అప్పగించాల్సి ఉంది. పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్ నిర్మలకుమారికి ఎఫ్‌ఏసీ హెచ్‌ఎంగా అవకాశం ఉంది. ఆమె కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ అశ్వనీకుమార్ ఎఫ్‌ఏసీ బాధ్యతలు తనకే దక్కాలనే దురుద్దేశంతో నిర్మలకుమారికి సంబంధించిన ఎస్‌ఆర్, అటెండెన్స్ రిజిస్టర్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నాడని అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు చెబుతున్నారు. శుక్రవారం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అందరూ కలిసి రిజిస్టర్లు ఇవ్వాలని అశ్వనీకుమార్‌కు తెలపడంతో మాటామాటా పెరిగింది. ఆ సమయంలో అశ్వనీకుమార్‌ను పీఎస్ ఉపాధ్యాయుడు రహమత్ గట్టిగా నిలదీయడంతో అశ్వనీకుమార్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎస్సై నాగరాజు ఇరువురు ఉపాధ్యాయులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఇబ్బందులు

వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో స్టడీ సర్టిఫికెట్ల కోసం పూర్వ విద్యార్థులు పాఠశాలకు వస్తూ ఉన్నారు. ఈ సమయంలో పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అశ్వనీకుమార్ లేకపోవడం, రికార్డులు కూడా అందుబాటులో లేకుండా బీరువాలో పెట్టి తాళాలు వేసి వద్దనే ఉంచుకోవడంతో పూర్వ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే 10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 18వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉన్నా గణిత ఉపాధ్యాయుడు అశ్వనీకుమార్ పాఠశాలలో అందుబాటులో ఉండకపోవడం చర్చనీయాంశమైంది. పాఠశాలలో పని చేస్తున్న మరో గణిత ఉపాధ్యాయుడు ఒక్కరే విద్యార్థులకు గణితంలో శిక్షణ ఇస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఏదిఏమైనప్పటికీ పాఠశాలలో ఆధిపత్యం ప్రదర్శించడానికి గణిత ఉపాధ్యాయుడు అశ్వనీకుమార్ పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కడం బాగోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

ఘనంగా వీబీఎస్ ఆదివారం


పాటలు పాడుతూ నృత్యం చేస్తున్న చిన్నారులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో గల తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో వీబీఎస్ ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 28 నుంచి మే 7వ తేదీ వరకు వేసవికాల విరామ బైబిల్ పాఠశాలను చర్చిలో నిర్వహించారు. వీబీఎస్ ఆదివారం సందర్భముగా చర్చ్ పాస్టర్ పులుకూరి అమృత్ తేజ్ దైవ సందేశం అందించారు. చర్చిలో చిన్నారుల ఆటలు, నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీబీఎస్ డైరెక్టర్ సుస్మిత, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగాభవానీ, వీబీఎస్ టీచర్లు హర్షిత, లావణ్య, సౌమ్య, వినీల, కృతి మాధురి, సత్య స్రవంతి, వీబీఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బీజేపీ గ్రామ కమిటీలు ఏర్పాటు

మార్కాపురం టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు పోటీ చేయాలని ఆ పార్టీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు సూచించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాయవరం, మొద్దులపల్లి, మన్నెంవారిపల్లి గ్రామ బీజేపీ కమిటీలు ఏర్పాటు చేశారు. రాయవరానికి కె.శ్రీనివాసరెడ్డి, నాయుడుపల్లికి జానపాటి శ్రీనివాసరావు, మన్నెంవారిపల్లికి వి.పెద్ద వెంకటేశ్వర్లు, మొద్దులపల్లికి లింగాల నారాయణను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి రాఘవేంద్ర, ప్రవీణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి

బేస్తవారిపేట: పుస్తక పఠనంతో విద్యార్థులకు మరింత విజ్ఞానం చేకూరుతుందని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. పుస్తక పఠనం, బొమ్మలు వేయడం, చెస్, కథలు చదడంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయంలో శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు, పాలవ్యాన్ ఢీ

- నలుగురికి గాయాలు


సంఘటనా స్థలంలో కారు, పాలవ్యాన్

మార్కాపురం: కారు, పాల వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మార్కాపురం మండలం చింతగుంట్ల–కుంట గ్రామాల మధ్య చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. పోరుమామిళ్లకు చెందిన శివశంకర్, అరుణ, రాజేశ్వరి, ఫణీంద్ర కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. చింతగుంట్ల దాటిన తర్వాత మార్కాపురం నుంచి కంభం వెళ్తున్న పాల వ్యాన్ ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం


క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్న అశోక్‌రెడ్డి, సంజీవ్ తదితరులు

మార్కాపురం: వేసవి శిక్షణ శిబిరాలను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ అశోక్‌రెడ్డి, డాక్టర్ సంజీవ్ కోరారు. ఆదివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శాప్, కోడిరామ్మూర్తి ఆరోగ్య క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో వేసవి క్రీడా నట శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. శిక్షణ శిబిరాలకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్‌లు వేణు, ఉప్పు రామకృష్ణ, నాగార్జున, కాశంగి శ్రీనివాసులు, పిన్నిక నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీకేపీ కళాశాలలో..

ఎస్‌వీకేపీ కళాశాలలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని రాయల్ స్పోర్ట్స్ అసోసియేషన్ దీక్షా యూత్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సహకారంతో రిటైర్డ్ హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కట్టా రహ్మతుల్లా మాట్లాడుతూ.. ఉచితంగా వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీధర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిరాముడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పట్టాభిరామస్వామి

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామస్వామి ఆలయ వార్షికోత్సవం, శిఖర కలశ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం గణపతిపూజ, స్వస్తి వచనం, కంకణధారణ, మండపారాధన, పంచామృత అభిషేకాలు, అలంకరణ, అర్చనలు, సాయంత్రం హోమాలు, మంగళహారతి పూజలు నిర్వహించారు. పూజా కార్యాక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

చెన్నకేశవస్వామికి వైభవంగా గరుడ సేవ


గరుడసేవలో స్వామివారు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి గరుడ సేవ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి గ్రామోత్సవం కనులపండువగా సాగింది. గరుడ సేవ ఉత్సవ ఉభయదాతలుగా దమ్మాలపాటి, ముత్యాల, అవిసినేని, గంగవరపు, కర్నా కుటుంబాల దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం ఎల్లటేనుగు ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.


తాటి కాయలతో చక్రాల ఆట


ఉత్సాహంగా కోలాటం ఆడుతూ..

రోజంతా హుషారు.. ఊరంతా షికారు!

కొనకనమిట్ల: వేసవి సెలవుల్లో చిన్నారులు రోజంతా హుషారుగా ఆటపాటలతో సందడి చేస్తున్నారు. కర్రాబిళ్ల, కబడ్డీ, కోతి కొమ్మచ్చి, జంపింగ్, తొక్కుడుబిళ్ల, కుంటుల్లాట, గాలిపటాలు, గోలీలాట, బొంగరాల ఆటలతో పాటు సినిమా హీరోల గ్రీటింగ్‌లతో ఎంజాయ్ చేస్తున్నారు. ఈ చిత్రాలు కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.


క్రికెట్ ఆడుతూ..


బొంగరం తిరగాల్సిందే..


చెట్టునీడలో సెల్‌ఫోన్‌లో నిమగ్నమైన కుర్రాళ్లు


అన్నా రాంబాబును సన్మానిస్తున్న చర్చి నిర్వాహకులు

ఏసు బోధనలు అనుసరణీయం

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని గజ్జలకొండ గ్రామంలో ఉన్న హోలీ గాస్పెల్ చర్చి ఆవరణలో నిర్వహించిన ఏసయ్య రక్షణ సువార్త ఉజ్జీవ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తోటివారిపై ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్ ఆదిమూలపు జాన్ విక్టర్‌పాల్, ఝాన్సీరాణి, రోజ్‌లిడియా, కర్టిల్, జఫన్యా, మోషె, కర్నా తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ డీఎం నరసింహులు వెల్లడి


ఆర్టీసీ డీఎం

మార్కాపురం: సరస్వతీ పుష్కరాలకు మార్కాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులు తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి సరస్వతీ నది పుష్కర స్నానాలు ప్రారంభమవుతున్నాయని, 22వ తేదీ వరకు పుష్కరాలు జరుగుతున్నట్లు తెలిపారు. గోదావరి, ప్రాణహిత సరస్వతీ నదుల సంగమమే దక్షిణ త్రివేణి సంగమమని తెలిపారు. సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామని, ఒక్కో టిక్కెట్ ధర రూ.1900గా నిర్ణయించినట్లు చెప్పారు. కాళేశ్వరం, రామప్పదేవాలయం, వరంగల్లు భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాల గుడిని ప్రయాణికులు, యాత్రికులు సందర్శించవచ్చని వివరించారు. రెండు రోజులపాటు యాత్ర ఉంటుందని, ఈనెల 15వ తేదీన బస్సు బయలుదేరుతుందని తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రముఖ శైవ క్షేత్రమైన అరుణాచలానికి మార్కాపురం డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డీఎం తెలిపారు. ప్రతి నెల పౌర్ణమి ముందు రోజు బస్సు బయలుదేరుతుందని, కాణిపాకం, తిరుత్తణి, కంచి, అరుణాచలం, గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించవచ్చని, ఒక్కో టికెట్ ధర 2500 రూపాయలని తెలిపారు. వసతి, భోజన ఖర్చులు యాత్రికులే భరించాలని స్పష్టం చేశారు. వివరాలకు 73828 90805, 99592 25699ను సంప్రదించాలని సూచించారు.

ఏ1 గ్లోబల్‌లో 29 మంది ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

మార్కాపురం: కళాశాలలో నిర్వహిస్తున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, డైరెక్టర్ మసూద్ సూచించారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూల్లో 29 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. పలువురికి వార్షిక వేతనాలు భారీ స్థాయిలో ఉన్నట్లు చెప్పారు. టెక్ మహీంద్రాకు 18 మంది, హెచ్‌సీఎల్‌కు నలుగురు, యాక్సెంచర్ ఐటీ సంస్థకు ఏడుగురు ఉద్యోగాలకు ఎంపికై నట్లు వివరించారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్‌లు షరీఫ్ ఆర్య, దయా స్వరూప్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్‌కు అంతరాయం


విద్యుత్ లేని సమయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయం

కంభం: నిత్యం రద్దీగా ఉండే కంభం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సుమారు 15 రోజులుగా యూపీఎస్‌లు పనిచేయడం లేదు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడల్లా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతవారం రోజులుగా తరచూ పెనుగాలులు, వర్షం పడుతుండటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో కార్యాలయంలో సేవలు నిలిచిపోయి సమస్య మరింత జటిలంగా మారుతోంది. విద్యుత్ సక్రమంగా లేకపోవడంతో ఒక్కోసారి రాత్రి 8 గంటల వరకు ఉండాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి యూపీఎస్‌లకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్ భార్య అంత్యక్రియల్లో 'అన్నా'


లక్ష్మీదేవి అంత్యక్రియల్లో పాల్గొన్న అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొమ్మునూరు గ్రామ మాజీ సర్పంచ్ వైఎస్సార్ సీపీ నాయకుడు సంగని అంకిరెడ్డి సతీమణి లక్ష్మీదేవి శనివారం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఓబుల రావు, పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి(కురిచేడు): కురిచేడు రోడ్డు ఏరియాలో విద్యుత్ లైన్ కింద సాగర్ పైప్‌లైను మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అంకబాబు తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.